క్లుప్తంగా

కాలువల్లో పూడిక తొలగింపు


కాలువల్లో పూడిక తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

కొత్తపల్లి: నాగులాపల్లిలో క్షీణించిన పారిశుద్ధ్య పరిస్థితులపై 'సాక్షి'లో 'పారిశుద్ధ్యం అధ్వానం' శీర్షిక ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బంది ద్వారా కాలువల్లో పూడికను తొలగించారు. రోడ్లపై నిలిచిపోయిన మురుగు, వర్షపు నీరు పోయేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు.

ఈ-క్రాప్ నమోదు చేయించాలి


గొల్లప్రోలు మండలంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

పిఠాపురం: పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని గొల్లప్రోలు మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ కోరారు. ఆదివారం గొల్లప్రోలు మండలంలోని పలు గ్రామాల్లో పొలాలను పరిశీలించి, ఈ-క్రాప్ నమోదు చేశారు. గడువు సమీపిస్తున్నందున రైతులు ఆర్బీకేల వద్ద ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఇప్పటికే వ్యవసాయ సిబ్బంది ఆయా గ్రామాల్లో రైతులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. పంట నమోదు ఈ నెల 15 చివరి తేదీ కావడంతో, గొల్లప్రోలు మండలంలో ఈ-క్రాప్, ఈ-కేవైసీ విధిగా చేయించాలన్నారు. సార్వా సీజన్లో వేసిన పంట నీట మునిగినందున, వాటికి పంట నష్టం చేయాల్సి వస్తే, ఈ-క్రాప్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అప్పుడే పంట నష్టం, బీమా, బ్యాంకు రుణాలు వస్తాయన్నారు. ఆదివారం కూడా సిబ్బంది అందుబాటులో ఉండి ఈ-కేవైసీ చేస్తున్నారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సీఐగా కృష్ణభగవాన్ బాధ్యతల స్వీకరణ



సామర్లకోట: కొత్త సామర్లకోట పోలీస్‌స్టేషన్ సీఐగా ఎ.కృష్ణభగవాన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సీఐల బదిలీల్లో భాగంగా ఇప్పటివరకు పనిచేసిన డి సురేష్ బదిలీ కావడంతో, క్రైం సీఐగా ఉన్న అంకబాబును ఇక్కడ నియమించారు. మళ్లీ మూడు రోజుల్లోనే ఆయనను క్రైం సీఐగా పూర్వ స్థానానికి పంపారు. అప్పటి నుంచి సీఐ పోస్టు ఖాళీగా ఉండటంతో, కృష్ణభగవాన్‌ను నియమిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. గతంలో ఈయన పెద్దాపురం పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా పని చేశారు.

నేటి నుంచి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

సామర్లకోట: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల శిక్షణలో భాగంగా స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రం(ఈటీసీ)లో సోమవారం నుంచి మూడు రోజుల పాటు 'ఆరోగ్యకరమైన గ్రామం' అనే అంశంపై శిక్షణ ఉంటుందని ఈటీసీ మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ, ఇప్పటి వరకు ఆరు అంశాలపై శిక్షణ పూర్తి చేశారన్నారు. మరో మూడు అంశాలపై ఈ నెలలో శిక్షణ పూర్తి చేయాల్సి ఉన్నదని చెప్పారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకున్న జిల్లాల్లోని వివిధ శాఖల అధికారులు శిక్షణకు హాజరవుతారని తెలిపారు.

అలరించిన ఘంటసాల సంగీత విభావరి


ఆలయ కమిటీ సభ్యులతో నిర్వాహకులు

సామర్లకోట: స్టేషన్ సెంటర్‌లోని నూకాలమ్మ ఆలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఘంటసాల సంగీత విభావరి అలరించింది. ఘంటసాల అభిమాన సంఘ నాయకుడు చిపాడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతరించిపోతున్న కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు భీమవరం కళాకారులతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు నాగేశ్వరరావు చెప్పారు. కళాకారులను ఆలయ చైర్మన్ వల్లూరి బుల్లియ్య, కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు, కమిటీ సభ్యులు యార్లగడ్డ శ్రీనివాసు, గిడుతూరి శ్రీనివాసు, గదం రామకృష్ణ, దూళ్ల సత్యం తదితరులు సత్కరించారు.


గోతులతో నిండిన సామర్లకోట మాండవ్య నారాయణస్వామి ఆలయం రోడ్డు


సామర్లకోట-వేట్లపాలెం కెనాల్ రోడ్డు దుస్థితి

ప్రయాణం ఎలా?

- కెనాల్ రోడ్డులో అడుగడుగునా గోతులే..
- తరుచూ వాహనాల ప్రమాదాలు
- అధికారుల నిర్లక్ష్యమే ప్రజలకు శాపం

సామర్లకోట: ఆర్అండ్‌బీ రోడ్లపై ప్రయాణం శాపంగా మారింది. కెనాల్ రోడ్లు అడుగడుగునా గోతులు పడడంతో.. వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్అండ్‌బీ రోడ్లు గోతులు పడడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ప్రజలు మండిపడుతున్నారు. ఆర్అండ్‌బీ రోడ్లలో ఎక్కువ భాగం తారు రోడ్లే ఉన్నాయి. రోడ్ల నిర్మాణ సమయంలో అధికారులు సాంకేతిక పరంగా కొంత వాలుగా నిర్మిస్తే, వర్షపు నీరు రోడ్డు మార్జిన్‌లోకి పోయే అవకాశం ఉంటుంది. సాంకేతిక లోపంతో అనేక రోడ్ల మధ్యలో వాలుగా ఉండటం వలన నీరు మధ్యలోనే నిలిచిపోతోంది. దాంతో వర్షాలు వచ్చిన సమయాల్లో నీరు నిలిచిపోయి, రోడ్డు ధ్వంసమవుతోంది. దాంతో చిన్న గోతులు సైతం భారీగా మారుతున్నాయి.

తరచూ ప్రమాదాలు

దీనికితోడు నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోతులు ఎక్కువై, నీటి గుంతలుగా మారుతున్నాయి. దాంతో ఎక్కడ పెద్ద గోతులున్నాయో ద్విచక్ర వాహన చోదకులు గమనించలేని పరిస్థితి ఏర్పడుతోంది. రాత్రి సమయాల్లో తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికితోడు రోడ్డు మార్జిన్‌లో మట్టి దిమ్మలు పెరిగినా, వాటిని తొలగించక పోవడం వలన రోడ్లపై నీరు బయటకు పోయే అవకాశం ఉండటం లేదు. కెనాల్ రోడ్డుకు ఒకవైపు గోదావరి కాలువ, మరోవైపు మురుకు కాలువలున్నాయి. దాంతో రోడ్లు సక్రమంగా నిర్మిస్తే, రహదార్లపై చుక్క నీరు నిలిచే అవకాశం ఉండదని నిపుణులు అంటున్నారు.

మరమ్మతులకూ దిక్కు లేదు!

అతి ప్రమాదకరంగా ఉన్న రోడ్లను మరమ్మతులు చేయడానికి కూడా అధికారులు ముందుకు రాకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దాంతో రోడ్లు మృత్యు కూపాలుగా మారుతున్నాయి. కెనాల్ రోడ్డులో స్థానిక మాండవ్య నారాయణస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు భారీ గోతులతో నిండిపోయింది. ఈ రోడ్డులో అనేక పర్యాయాలు ట్రాక్టర్లు బోల్తా పడ్డాయి. దాంతో వాహన చోదకులు ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో బ్రిడ్జిపై ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై రోడ్డు కూడా గోతులమయంగా మారింది. అదే విధంగా షుగర్ ఫ్యాక్టరీ నుంచి బిక్కవోలు వెళ్లే రోడ్డు మరింత అధ్వానంగా మారింది. అధికారులు గోతులు పూడ్చే చర్యలు చేపట్టి, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్లపై దృష్టి పెట్టాలి



ప్రజలు నిత్యం రోడ్లపై రాకపోకలు చేస్తుంటారు. వాటిపై అధికారులు దృష్టి సారించవలసిన అవసరం ఉంది. రోడ్లపై ఉన్న కల్వర్టుల రంధ్రాలు మూసుకుపోవడం వలన నీరు నిలిచిపోతోంది. ఆ మట్టిని తొలగిస్తే సమస్య పరిష్కారం అవుతుంది. అయినా నిర్లక్ష్యమే. రోడ్ల మార్జిన్‌లో మట్టి దిమ్మలు తొలగించి, రోడ్లపైకి వచ్చిన తుప్పలు తొలగించాలి. రోడ్లు వాలుగా నిర్మించాలి. వెంటనే రోడ్లపై గోతులను పూడ్చి, ప్రమాదాలు నివారించాలి.

– నేతల హరిబాబు, కౌన్సిలర్, సామర్లకోట

వర్షాలు తగ్గాక పూడ్చివేత



గోతులు పూడ్చే పనులను వర్షాలు తగ్గిన తర్వాత ప్రారంభిస్తాం. పనులు ప్రారంభించడానికి ప్రయత్నం చేస్తున్న ప్రతిసారి వర్షం పడుతూ ఉంది. దాంతో పనులు వాయిదా పడ్డాయి. పెద్ద గోతులు ఉన్న రోడ్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించడానికి ప్రతిపాదనలు చేస్తాం.

– అంబటి సూర్యప్రకాష్, ఇన్‌చార్జి ఆర్అండ్‌బీ డీఈ, తుని

శృంగార వల్లభుడికి చవితి ఎఫెక్ట్

రూ.1.08 లక్షల ఆదాయం


స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు


శృంగార వల్లభ స్వామివారు

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి వినాయక చవితి పర్వదినం సందర్భంగా శనివారం భక్తుల రద్దీ తగ్గింది. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామివారికి రూ.1,08,627 ఆదాయం సమకూరినట్టు ఈఓ తెలిపారు. స్వామివారి దర్శనానినికి వచ్చిన భక్తులు, దాతలకు ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమ చార్యులు, నారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటాలను అందజేశారు. సుమారు ఆరు వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, 3,500 మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించినట్టు ఈఓ తెలిపారు. సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, మొయిళ్ల రాయన్న, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా కళకు ఊపిరి గరికిపాటి


గరికిపాటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దాపురం: ప్రజా కళకు ఊపిరి పోసిన గరికిపాటి రాజారావు జీవితాన్ని ప్రతి ప్రజా కళాకారుడు ఆదర్శంగా తీసుకోవాలని పలువురు కళాకారులు అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం గరికిపాటి వర్ధంతి సభ ప్రజా నాట్యమండలి మండల కార్యదర్శి రొంగల వీర్రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల తొలి నాళ్లలో సాంస్కృతిక వ్యవస్థను ఆయన ప్రారంభించారన్నారు. సమసమాజ భావజాలంతో కళను, కళారూపాలను తీర్చిదిద్దిన ఘనత గరికిపాటికే దక్కిందన్నారు. గరికిపాటి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజా నాట్యమండలి ద్వారా సామాజిక చైతన్యం కోసం ప్రజా కళాకారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తొలుత గరికిపాటి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దారపురెడ్డి సత్యనారాయణ, డి.కృష్ణ, మహపాతిన రాంబాబు, రామిశెట్టి సుబ్రహ్మణ్యం, కూనిరెడ్డి అప్పన్న, కేదారి నాగు, మంతెన సత్తిబాబు, మాగాపు నాగు, దేవాడ పాపేశ్వరరావు, సిరిపురపు శ్రీనివాస్, రొంగల అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భయం గుప్పెట్లో ఏటిపట్టు గ్రామాలు

- ప్రమాద స్థితిలో ఏలేరు కాలువపై తాత్కాలిక వంతెన
- ఆర్డీఓ సీతారామారావు సమీక్ష


కాండ్రకోట దబ్బ కాలువ వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దాపురం: తుపాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఏటిపట్టు గ్రామాలు భయంగుప్పిట బిక్కుబిక్కుమంటున్నాయి. ఏలేరు ప్రాజెక్ట్ నుంచి 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో, ఏటిపట్టు ప్రాంతాలైన గుడివాడ, జె.తిమ్మాపురం, పులిమేరు, తూర్పుపాకల, జి.రాగంపేట, చంద్రమాంపల్లి, కట్టమూరు, కాండ్రకోట, దివిలి, తాటిపర్తి, ఉలిమేశ్వరం, సిరివాడ, మర్లావ, తిరుపతి, చదలాడ తదితర గ్రామాల రైతులు భయాందోళన చెందుతున్నారు. వరద ఉధృతి కారణంగా ఏలేరు కాలువపై బ్రిటిష్ కాలం నాటి వంతెన 2022 అక్టోబర్‌లో కొట్టుకుపోయింది. దీంతో రైతులు ప్రభుత్వ సహకారంతో తాత్కాలిక వంతెన నిర్మించారు. ప్రస్తుతం అది కూడా ప్రమాదకర పరిస్థితిలో ఉంది. సామర్థ్యానికి మించి వరద ఉధృతికి తాత్కాలిక వంతెన కూడా కొట్టుకుపోయేలా ఉంది. దీంతో స్థానిక రైతులు గండ్లు కొట్టి నీటి ప్రవాహం వంతెనను బలంగా తాకకుండా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఈ వంతెనపై రాకపోకలను నిలిపివేశారు. కట్టమూరు, జె.తిమ్మాపురం, తూర్పుపాకలు, కాట్రావులపల్లి తదితర గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. కట్టమూరు, కాండ్రకోట గ్రామంలో ఏలేరు కాలువపై ఉన్న వంతెనల వద్ద వరద ఉధృతిని ఆర్డీఓ జె సీతారామారావు, ఇరిగేషన్ ఏఈ పాలెపు వీరబాబు, ఎస్సై మౌనికతో కలిసి ఆదివారం పరిశీలించారు.

నిలదీసిన టిడ్కో లబ్ధిదారులు


టీడీపీ నేతలకు చుక్కెదురు


సామర్లకోట టిడ్కో ఇళ్ల వద్ద నాయకులను ప్రశ్నిస్తున్న మహిళలు

సామర్లకోట: టిడ్కో ఇళ్లను సందర్శించిన టీడీపీ నాయకులను ఆ ప్రాంత మహిళలు నిలదీశారు. టిడ్కో ఇళ్లలోనికి పాములు వస్తున్నాయని, కనీసం లైట్లు అయినా వేయించాలని మహిళలు మండిపడ్డారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయడంతో పిఠాపురం రోడ్డులోని ఏలేరు కాలువను ఆదివారం సాయంత్రం పరిశీలించిన టీడీపీ నాయకులు, ఏలేరు కాలువ సమీపంలో ఉన్న టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల వద్దను వెళ్లారు. రోడ్ల కంటే ఇళ్లు తక్కువ ఎత్తులో ఉండటం వలన నీరు వస్తుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. గత టీడీపీ పాలనలో టిడ్కో ఇళ్లు నిర్మించిన సమయంలో రోడ్డు కంటే తక్కువ ఎత్తులో ఇళ్లు ఉండడంతో, ఏలేరు కాలువ ఉధృతంగా వచ్చిన సమయంలో, టిడ్కో ఇళ్లలోకి నీరు చేరుతుందన్నారు. వారిని అప్రమత్తంగా ఉండాలని టీడీపీ నాయకులు ఈ సందర్భంగా సూచించారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, కౌన్సిలర్ బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ అడబాల కుమారస్వామి, మాజీ కౌన్సిలర్ బడుగు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

గోపురం నుంచి ఊడిన పెచ్చులు


రాజగోపురం నుంచి ఊడిపడిన పెచ్చులు


శిథిల రాజ గోపురం

కొత్తపల్లి: గోర్స గ్రామంలో 14వ శతాబ్దంలో సీతారామాలయాన్ని నిర్మించారు. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆలయ గోపురం, రాజగోపురంపై మొక్కలు మొలిచి, పెచ్చులు ఊడి పడిపోతున్నాయి. దీంతో గ్రామస్థులు ఆదివారం ఆలయం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయినంపూడి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ, గతంలో దాతల సహకారంతో ఆలయ రాజగోపురానికి మరమ్మతులు నిర్వహించినట్టు చెప్పారు.ఆలయానికి ఆదాయం లేకపోవడంతో ఆలయ అభివృద్ధి, నిర్వహణ లేదన్నారు. ఆలయం శిథిలావస్థకు చేరి గోపురాలు పెచ్చులు ఊడిపడుతున్నాయన్నారు. దేవదాయ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా, పట్టించుకోవడం లేదని విమర్శించారు. సర్పంచ్ రొంగల వీరబాబు, ఆలయ అర్చకులు అనంతాచార్యులు తదితరులు ఉన్నారు.

బొజ్జ గణపయ్య.. నీ బంటు నేనయ్య..

కనుల పండువగా చవితి ఉత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో పాదగయ క్షేత్రంలో చింతామణి గణపతి స్వామివారు


సామర్లకోట పంచారామ క్షేత్రంలో నిర్వహిస్తున్న గణపతి హోమం


కొత్తపల్లిలో లక్ష్మీగణపతి స్వామివారిని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు


పాదగయ క్షేత్రంలో చింతామణి గణపతి స్వామివారి గ్రామోత్సవం


గొల్లప్రోలు వినాయక మంటపంలో భజనలు


పిఠాపురంలో వినాయక మంటపంలో చేస్తున్న పూజలు


మర్లావలో గణనాథుడికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


సామర్లకోటలో స్వామివారిని దర్శించుకుంటున్న ఆవాల లక్ష్మీనారాయణ, రాజేశ్వరి దంపతులు

పిఠాపురం: గణపతి నవరాత్రి ఉత్సవాలు శనివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అన్ని గ్రామాల్లోను వినాయక మంటపాలు ఏర్పాటు చేయడంతో గ్రామాల్లో వినాయక నామస్మరణలు హోరెత్తాయి. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు తదితర మంటలాలల్లో సుమారు 360 వినాయక మంటపాలు ఏర్పాటు చేశారు. పిఠాపురం కోటగుమ్మం సెంటర్లో ఉన్న జైగణేష్ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభ కాగా, ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలువురు భక్తులు వినాయక దీక్షలు స్వీకరించారు. పాదగయ క్షేత్రంలో ఉన్న చింతామణి గణపతికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనులపండువగా స్వామివారి గ్రామోత్సవం జరిగింది. గొల్లప్రోలు మంటలం చేబ్రోలులో వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

గణనాథునికి ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: మంటలంలో గణపతి నవరాత్రులు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఆలయాలు, మంటపాల వద్ద ప్రత్యేక పూజలు, పలు సాంస్కృతిక కార్యాక్రమాలను ఏర్పాటు చేశారు. వాకతిప్ప శాలివాసా పద్మశాలీ రామాలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపల్లి వద్ద సుమారు ఐదడుగుల మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కొత్తపల్లి పోలమ్మగుమ్మం సెంటర్‌లోని లక్ష్మీగణపతి విగ్రహానికి గణేష్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంటలంలోని గణపతి ఆలయాల వద్ద స్వామివారికి పంచామృత అభిషేకాలు, వివిధ రకాల పూలు, పత్రులతో పూజలు నిర్వహించారు.

పెద్దాపురం: గణపతి నామస్మరణలతో పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాలు మారు మోగాయి. స్థానిక మెయిన్‌రోడ్డు, మున్సిపల్ సెంటర్, పాశిలివీధి, పాత పెద్దాపురం, బొమ్మల గుడి వీధి తదితర ప్రాంతాల్లో గణేశ్ విగ్రహాలను నెలకొల్పారు. రూరల్ ప్రాంతంలోని అన్ని గ్రామాల్లో, పట్టణంలోని అన్ని వాడల్లో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మర్లావ, రాయభూపాలపట్నం, గోరింట, చదలాడ, పులిమేరు, కాండ్రకోట, తాటిపర్తి, దివిలి, చంద్రమాంపల్లి తదితర గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, రోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. పెద్దాపురం పట్టణంలోని పలు స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయక ప్రతిమలను నెలకొల్పి.. పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చినప్పటికీ, చాలాచోట్ల రంగుల వినాయక విగ్రహాలే దర్శనమిస్తున్నాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు ముఖ్యఅతిథులుగా హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మర్లావ గ్రామంలో వైస్ ఎంపీపీ మిరియాల రాజా ఆధ్వర్యంలో నవరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తొలిరోజు ఆర్కెస్ట్రా ఆకట్టుకుంది. తొలుత రాజా దంపతులు పీటలపై ఆశీనులై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు ప్రారంభం

సామర్లకోట: గణపతి నవరాత్రి ఉత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో వాడవాడలా ప్రారంభమయ్యాయి, రైల్వే స్టేషన్, టాక్సీస్టాండ్, ఆటో యూనియన్లు, లారీ స్టాండ్లతో పాటు, ముఖ్య కూడళ్లలో గణపతి పందిళ్లను ఏర్పాటు చేశారు. స్వామివారిని పట్టణ ప్రముఖులు దర్శించుకుని, పూజలు నిర్వహించారు. స్థానిక సీతాఫలదొడ్డిలోని గణపతి శిబిరంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యరక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, అయ్యరక కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆవాల రాజేశ్వరి స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. భరతమాత సేవా పరిషత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర, ఆయా పార్టీల నాయకులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆయా ప్రాంతాల్లోని గణపతి ఆలయాలు, పందిళ్లలోని గణపతిని దర్శించుకుని పూజలు చేశారు.

పంచారామ క్షేత్రంలో హోమం, గ్రామోత్సవం

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో ఉన్న గణపతి ఆలయంలో శనివారం ఉదయం గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని వెండి ఆభరణాలతో అలంకరించారు. గణపతి ఆలయం వద్ద గణపతి హోమాన్ని ఆలయ ఈఓ భళ్ల నీలకంఠం ప్రారంభించారు. సాయంత్రం ఆలయం నుంచి గ్రామోత్సవం మొదలైంది. మూషిక వాహనంపై గణపతి విగ్రహాన్ని ఉంచి, ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా పట్టణ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.